https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్

ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 | సంచిక : 57 | సోమవారం 29-06-2026 | పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం
Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి అంక్షలు లేకుండా
రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో
పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

ప్రక్షాళనకు అడ్డుపడితే మూసీలో వేసి తొక్కుతాం..

- కాలుష్యంతో ప్రజలు అనుభవిస్తున్న గోస చూస్తున్నాం

కలెక్షన్లు, ఎలక్షన్లు, సెలక్షన్లే బీఆర్ఎస్ చేసిన త్యాగాలు

నల్లగొండ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

నల్లగొండ, జూన్ 28

మూసీ ప్రక్షాళనకు ఎవరు అడ్డుపడ్డా, ఎన్ని ఆటంకాలు సృష్టించినా తమ ప్రభుత్వం వెనక్కి తగ్గబోదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అడ్డొచ్చిన వారిని మూసీలో వేసి తొక్కి మరీ ప్రక్షాళన చేసి తీరతామని ప్రకటించారు. మూసీ కాలుష్యంతో ప్రజలు ఎంత గోస అనుభవిస్తున్నారో చూస్తున్నామని తెలిపారు. ప్రధాని మోదీ.. సబర్మతి నదిని, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి.. యమునా నదిని ప్రక్షాళన చేసిన దానికంటే గొప్పగా మూసీని ప్రక్షాళించి ప్రపంచ దేశాల నుంచి ఇక్కడకు వచ్చి చూసి వెళ్లేలా తీర్చిదిద్దుతామని చెప్పారు. రోడ్లు, భవనాల శాఖ ద్వారా రూ.13,006.27 కోట్లతో చేపట్టిన హ్యామ్ రోడ్ల పథకానికి ఆదివారం నల్లగొండ జిల్లా కనగల్ వద్ద ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ పథకానికి సంబంధించి అక్కడ ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరించారు. అక్కడి నుంచి నల్లగొండ జిల్లా కేంద్రానికి చేరుకొని అక్కడ రూ.83 కోట్లతో చేపట్టిన తాగునీటి పథకానికి శంకుస్థాపన చేశారు. అనంతరం పట్టణంలోని ఎన్‌జీ కాలేజీ మైదానంలో జరిగిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ.. ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేపీపై విమర్శలు చేశారు. “రెండున్నరేళ్లలో రేవంత్‌రెడ్డి ఏం తెచ్చారు, ఏం చేశారు అని అడుగుతున్నారు. వారికి సవాల్ విసురుతున్నా. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, పన్నెండేళ్ల కేంద్రంలోని బీజేపీ పాలన, రెండున్నరేళ్ల మా ప్రజాపాలనపై అసెంబ్లీ, మండలి ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ప్రత్యేకంగా చర్చిద్దాం. తెలంగాణ ప్రజలకు ఎవరం ఏం చేశామో తేలుద్దాం” అని సీఎం రేవంత్ సవాల్ విసిరారు. బీఆర్ఎస్ నేతలు పదే పదే త్యాగాలు చేశామని, తమ త్యాగాల పునాదుల మీద రాష్ట్రం ఏర్పాటైందని చెబుతున్నారని, అసలు త్యాగాలు ఎవరివని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. “రాజీనామాలు, కలెక్షన్లు, సెలక్షన్లు, ఎలక్షన్లతో పబ్బం గడిపిన మీది త్యాగమైతే.. తెలంగాణ తొలి ఉద్యమంలో మంత్రి పదవికి రాజీనామా చేసి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైతే తప్ప పదవులు చేపట్టబోనని ప్రతిన బూనిన కొండా లక్ష్మణ్‌బాపూజీ త్యాగం ఏమవుతుంది? మలిదశ తెలంగాణ ఉద్యమంలో తన మంత్రి పదవికి రాజీనామా చేసి, తన ఆరోగ్యాన్ని పణంగా పెట్టి నల్లగొండ గడ్డపై ఆమరణ దీక్ష చేసిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి త్యాగం ఏమవుతుంది? రూ.100తో పెట్రోల్ తెచ్చుకుని, అర్ధరూపాయి పెట్టి అగ్గిపెట్టె తెచ్చుకోలేని అగ్గిపెట్టెరావుది త్యాగమా? లేక ఒంటి నిండా మంట పెట్టుకుని నిలువునా దహించుకుపోయిన అమరుడు శ్రీకాంతాచారిది త్యాగమా? మీవి త్యాగాలైతే.. కానిస్టేబుల్ కిష్టయ్య, ఇషాన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, యాదయ్య చేసినవి ఏమవుతాయి?” అని రేవంత్ నిలదీశారు. రాష్ట్రాన్ని పదేళ్లపాటు పాలించిన బీఆర్ఎస్ వందేళ్ల విధ్వంసం సృష్టించిందని ఆరోపించారు. రూ.60 వేల కోట్ల నుంచి రూ.8 లక్షల కోట్లకు అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందన్నారు. బావ, బావమరిది (హరీశ్‌రావు, కేటీఆర్‌ను ఉద్దేశించి) తోడేళ్లలా తెలంగాణ మీద పడి తిరుగుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజలెవరూ మళ్లీ వారు రావాలని కోరుకోవడం లేదని, వారి కుటుంబం, వారి దోపిడీకి, దొంగతనాలకు అండగా ఉన్నవారే మళ్లీ వారి పాలన రావాలని కోరుకుంటున్నారని తెలిపారు. ప్రజలు మాత్రం వారిని శాశ్వతంగా సామాజిక బహిష్కరణ చేశారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌కు గతమే తప్ప భవిష్యత్తు లేదని నల్లగొండ గడ్డమీద నుంచి వేలాది మంది చెబుతున్నారని, వాళ్లను ఉప్పుపాతర వేశామని చెబుతున్నారని సీఎం పేర్కొన్నారు. ఆ పార్టీ నేతలు ఒంటి నిండా విషం నింపుకొని మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

బంగారం కొనుగోళ్లు తగ్గించినందుకు థాంక్స్

పశ్చిమాసియా సంక్షోభ సమయంలో.. ప్రజలు నా విజ్ఞప్తులను మన్నించారు

దేశ ప్రజల ఈ ఐక్యతే భారత్ బలం.. 'మన్ కీ బాత్'లో ప్రధాని నరేంద్రమోదీ

న్యూఢిల్లీ, జూన్ 28

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ సంక్షోభ పరిస్థితుల దృష్ట్యా తాను చేసిన విజ్ఞప్తిని మన్నించి.. దేశ ప్రయోజనాల కోసం బంగారం కొనుగోళ్లు తగ్గించుకున్న ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 'మన్ కీ బాత్' 135వ ఎపిసోడ్‌లో భాగంగా ఆదివారం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని ప్రసంగించారు. వివాహాలు వంటి వేడుకల్లో కూడా బంగారం కొనకుండా ప్రజలు పాత బంగారాన్నే పునర్వినియోగిస్తూ దేశభక్తిని చాటుతున్నారంటూ కొనియాడారు. విదేశీ ప్రయాణాలు వాయిదా వేసుకోవడం, కార్ పూలింగ్, మెట్రో ప్రయాణాల ద్వారా ఇంధనాన్ని ఆదా చేయడం, రైతులు రసాయన రహిత సహజ వ్యవసాయాన్ని అవలంబించడం వంటి ప్రజా భాగస్వామ్య శక్తే అంతర్జాతీయ సంక్షోభ సమయాల్లో భారతదేశాన్ని బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. రక్షణ రంగంలో జూన్ నెలలో సాధించిన విజయాలు ప్రతి పౌరుడికీ గర్వకారణమన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంతో పాటు, అహ్మదాబాద్‌లో జరిగిన 'ప్రపంచ యోగాసన ఛాంపియన్‌షిప్'లో 102 స్వర్ణాలు సహా 114 పతకాలు సాధించి భారత్ అగ్రస్థానంలో నిలవడంపై క్రీడాకారులను ప్రధాని అభినందించారు. హిందూ మహా సముద్రాన్ని అవకాశాల సముద్రంగా మార్చడమే లక్ష్యంగా సీషెల్స్‌తో కలిసి పని చేస్తున్నామని ప్రధాని మోదీ అన్నారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం సీషెల్స్ వెళ్లిన ప్రధాని మోదీ.. ఆ దేశ అధ్యక్షుడు ప్యాట్రిక్ హెర్మీనీ, ఉన్నతాధికారులతో ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై ఆదివారం ఉదయం చర్చించారు. అనంతరం ఓ ప్రత్యేక కార్యక్రమంలో సీషెల్స్ ప్రభుత్వం ప్రధాని మోదీకి "గార్డియన్ ఆఫ్ ద బ్లూ హారిజన్" పురస్కారాన్ని ఇచ్చి గౌరవించింది. పర్యావరణ పరిరక్షణ, అభివృద్ధి చెందుతున్న ద్వీప దేశాలకు ప్రధాని మోదీ అందిస్తున్న సహకారానికి గుర్తింపుగా సీషెల్స్ అధ్యక్షుడు ప్యాట్రిక్ ఆ పురస్కారాన్ని అందజేశారు.

సోనమ్ వాంగ్‌చుక్ ఆమరణ దీక్ష

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్

న్యూఢిల్లీ, జూన్ 26:

కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద పర్యావరణ వేత్త సోనమ్ వాంగ్‌చుక్ ఆమరణ దీక్షకు దిగారు. నీట్ అవకతవకలకు బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలంటూ జూన్ 20 నుంచి కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన నిరసనకు వాంగ్‌చుక్ మద్దతు ప్రకటించారు. అయితే, ఆయన దీక్షకు దిగిన కొద్ది గంటల్లోనే ఢిల్లీ పోలీసులు జంతర్‌మంతర్ వద్ద శానిటేషన్ సౌకర్యాలు నిలిపివేశారని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ఆరోపించారు. నిరసన స్థలంలో తాగునీటి కనెక్షన్ కూడా లేదని, కనీస పారిశుధ్య సౌకర్యాలు కల్పించకుండా పోలీసులు ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. వాంగ్‌చుక్ వయసు, ఆరోగ్య సమస్యల గురించి చెప్పినా పట్టించుకోవడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

దమ్ముంటే ముందస్తు ఎన్నికలకు రా!

ఎవరి సత్తా ఏమిటో ప్రజాక్షేత్రంలో తేల్చుకుందాం

సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు సవాల్

సిద్దిపేట జూన్ 28

"ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చేవ ఉంటే, దమ్ముంటే ఇప్పుడే అసెంబ్లీని రద్దు చేసి ముందస్తు ఎన్నికలకు రావాలి. ఎవరి సత్తా ఏమిటో ప్రజాక్షేత్రంలోనే చూసుకుందాం" అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సవాల్ విసిరారు. సీఎం హోదాలో ఉండి పాలన గాలికొదిలేసి, తన ఎత్తు, రూపం గురించి దిగజారి మాట్లాడటం రేవంత్‌రెడ్డికే చెల్లిందని మండిపడ్డారు. హరీశ్‌రావు ఆదివారం సిద్దిపేటలో జరిగిన బూత్ స్థాయి ఏజెంట్ల సమావేశంలో మాట్లాడారు. నల్లగొండ సభలో సీఎం చేసిన వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు. కర్ణాటకలో ముగ్గురు సీఎంల మీటింగ్‌పై, కృష్ణా-గోదావరి జలాల్లో తెలంగాణ హక్కుల రక్షణపై నేను ప్రశ్నిస్తే.. రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పలేక నల్లగొండ వెళ్లి పరుష పదజాలంతో తిడుతూ తప్పించుకుంటున్నారని ధ్వజమెత్తారు. తాను, జగదీశ్‌రెడ్డి పొట్టిగా ఉన్నా ప్రజలకు సేవ చేయడంలో పొడుగ్గానే ఉన్నామని, రేవంత్ బుద్ధి, ఆలోచనలు పొట్టివి కాబట్టే అలా మాట్లాడుతున్నారని విమర్శించారు.

నితిన్ నబీన్ పర్యటన ఓ ఫ్లాప్ షో

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆరోపణ

హైదరాబాద్, జూన్ 28 :

బీజేపీ చీఫ్ నితిన్ నబీన్ రాష్ట్ర పర్యటన ఓ ఫ్లాప్ షోగా మారిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. తెలంగాణ బీజేపీ నాయకులు చిన్న సమావేశాన్ని కూడా సరిగ్గా నిర్వహించలేకపోతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో గెలుస్తామని ప్రగల్భాలు పలికే ముందు వాస్తవాలు సరి చూసుకోవాలన్నారు. హైదరాబాద్ మెట్రో విస్తరణకు కేంద్రం నుంచి ఉన్న అన్ని అడ్డంకులను తొలగించి ఆ తర్వాత మిగతా విషయాలపై మాట్లాడాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతిపై విచారణకు నితిన్ నబీన్ సిద్ధమా అని ఆయన సవాల్ విసిరారు. లక్ష కోట్ల కాళేశ్వరం అవినీతిపై సీబీఐ ఎందుకు చర్యలు తీసుకోవట్లేదో సమాధానం చెప్పాలన్నారు. మతపరమైన రాజకీయం కోసమే పేర్ల మార్పును తెరపైకి తెస్తున్నారు తప్ప, నగర అభివృద్ధిపై బీజేపీ వద్ద ఎలాంటి రోడ్ మ్యాప్ లేదని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు.

ఉమ్మడి కుటుంబాలు మళ్లీ రావాలి!

అదే సమాజానికి, వ్యక్తులకు ఎంతో బలం

నాడు పిల్లలను విలువలతో పెంచడంలో నానమ్మ, అమ్మమ్మ, తాతయ్యలది కీలక పాత్ర

పిల్లల పెంపకంలో తండ్రులకూ బాధ్యత

సంతానం అంటే 'సంపద' అనే పరిస్థితి

ఎంత మంది పిల్లలను కన్నా ప్రోత్సహిస్తాం

ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన సీఎం

అమరావతి, జూన్ 28

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ చాలా బలమైనదని, అలాంటి వ్యవస్థ మళ్లీ రావాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. జాతీయ ఇమ్యూనైజేషన్ డే సందర్భంగా ఆదివారం గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో చిన్నారులకు ఆయన పోలియో చుక్కలు వేశారు. అనంతరం చిన్నారుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడారు. పిల్లలను ఎత్తుకుని ఆడించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి, వ్యాక్సినేషన్ వివరాలు తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల టీకాలను నిర్దిష్ట సమయానికి తప్పనిసరిగా వేయించాలని సూచించారు. పిల్లల పెంపకం భారంగా ఉంటుందా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లులతో ముఖ్యమంత్రి మాట్లాడి వారి వివరాలు అడిగారు. ఉద్యోగానికి, ఉపాధికి వెళ్తున్న మహిళలు పిల్లల పెంపకంలో ఎలా సమన్వయం చేసుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. ఇంట్లో భర్త, పురుషులు కూడా పిల్లల పెంపకంలో బాధ్యత తీసుకోవాలని సీఎం సూచించారు. పిల్లల్ని కని, పెంచడం, వారి ఆలనాపాలనా చూసుకోవడం తల్లికి మాత్రమే పరిమితం చేయకూడదని చెప్పారు. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉంటే పిల్లల పెంపకంలో పెద్దవాళ్లు భాగస్వాములు అయ్యేవారని అన్నారు. పిల్లలను విలువలతో పెంచడంలో నాడు అమ్మమ్మలు, తాతయ్యలు, ఇతర కుటుంబ సభ్యులు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషించేవారని గుర్తుచేశారు. సంతానాన్ని సమస్యగా, భారంగా చూసే విధానం పోవాలని, సంతానం అంటే సంపద అనే పరిస్థితి వస్తోందని అన్నారు. అందుకే ఇద్దరు అంత కంటే ఎక్కువ మంది పిల్లలు ఉండేలా ప్రభుత్వ పరంగా కూడా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ విషయంలో ముందుగా తల్లిదండ్రులకు అవగాహన పెంచే కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఉమ్మడి కుటుంబాలే సమాజానికి, వ్యక్తులకు కూడా ఎంతో బలాన్ని ఇస్తుందని తెలిపారు.

49 లక్షల మందికి చుక్కల మందు

రాష్ట్రంలో పల్స్ పోలియో కార్యక్రమం అమలుకు చేసిన ఏర్పాట్లను ఆరోగ్యశాఖ అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఐదు సంవత్సరాలలోపు వయసున్న సుమారు 49.20 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ కమిషనర్ చక్రధర్‌బాబుతో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'సర్' అంటే భయమెందుకు?

మజ్లిస్, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఈసీని విమర్శించడం విడ్డూరం: కిషన్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 28

'ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) అంటే మజ్లిస్, కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎందుకు భయపడుతున్నాయి. ఆ పార్టీలు ఎన్నికల సంఘంపై ఎందుకు ఆరోపణలు చేస్తున్నాయి?' అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రశ్నించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు సేకరించేది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులేనని, బయట రాష్ట్రాల ఉద్యోగులను తీసుకురాలేదని, అయినప్పటికీ కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎన్నికల సంఘంపై విమర్శలు చేయడం విచిత్రంగా ఉందన్నారు. ఆదివారం ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించిన బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడారు. పాతబస్తీలో అనేక దొంగ ఓట్లు ఉన్నాయని, బంగ్లాదేశ్ నుంచి వచ్చిన అక్రమ వలసదారులు, రోహింగ్యాలు హైదరాబాద్‌లోని కొన్ని బస్తీల్లో నివసిస్తున్నారన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. దొంగ ఓట్ల నిర్మూలనకు ఎస్ఐఆర్ సరైన మార్గమని చెప్పారు. ఈ దేశ పౌరుడు కాని ఏ వ్యక్తీ ఓటర్ల జాబితాలో ఉండకూడదన్నారు. దేశం కోసం, హైదరాబాద్ రక్షణ కోసం సర్‌లో పాల్గొనాలని, బీజేపీ కార్యకర్తలు ఒక్క ఇల్లు కూడా వదలకుండా తిరగాలని సూచించారు.

సుప్రీం కొలీజియంలోకి జస్టిస్ పీఎస్ నరసింహ

జస్టిస్ జె.కె. మహేశ్వరి పదవీ విరమణతో చోటు

న్యూఢిల్లీ, జూన్ 28:

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె.కె. మహేశ్వరి ఆదివారం పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో జస్టిస్ పి.ఎస్. నరసింహ సుప్రీంకోర్టు కొలీజియంలో సభ్యుడిగా బాధ్యతలు చేపట్టనున్నారు. సుప్రీంకోర్టులో ఐదో సీనియర్ న్యాయమూర్తిగా ఆయన 2028 మే 2న పదవీ విరమణ చేసే వరకు కొలీజియంలో కొనసాగుతారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు కొలీజియంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ పి.ఎస్ నరసింహ సభ్యులుగా ఉంటారు. 1963 మే 3న హైదరాబాద్‌లో జన్మించిన జస్టిస్ పీఎస్ నరసింహ.. నిజాం కళాశాలలో ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో డిగ్రీ పూర్తిచేశారు.

గంజాయి నిర్మూలనే పోలీస్ లక్ష్యం : ఎస్సై శ్రీధర్

రామకృష్ణాపూర్ జూన్ 28, (మన సమాజం):
పట్టణంలో గంజాయి రహిత నిర్మూలన లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం పనిచేస్తుందని పట్టణ ఎస్సై శ్రీధర్ పేర్కొన్నారు. గంజాయి సేవిస్తున్న అనుమానిత ఇండ్లలో నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ తో ఆదివారం తనిఖీలు చేపట్టారు. అలాగే బహిరంగ ప్రదేశాలలో తనిఖీలు చేపట్టి అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. యువత గంజాయి మత్తు పానీయాలకు అలవాటు పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు అని సూచించారు. నిత్యం పట్టణంలో తనిఖీలు చేపట్టడం జరుగుతుందని ఎవరైనా గంజాయి సేవించినట్లయితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడునని హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అంతేకాకుండా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గంజాయి నిర్మూలనపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈ ప్రత్యేకత తనిఖీల్లో పట్టణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు..

కమిషనర్ మారుతి ప్రసాద్..

రామకృష్ణాపూర్ జూన్ 28, (మన సమాజం):
ఐదేళ్ల లోపు చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు అవసరమని క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, వైస్ చైర్మన్ మిట్టపల్లి సరిత, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం పోలియో చుక్కల కార్యక్రమంలో భాగంగా పలు వార్డులలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి వారు మాట్లాడారు. పోలియో రహిత భారత్ ధ్యేయంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని ప్రాంతాలలో పోలియో చుక్కలు వేస్తున్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనివార్య కారణాల చేత పోలియో చుక్కలు వేయని పిల్లలకు మరో రెండు రోజుల పాటు ఇంటి వద్దనే డ్రాప్స్ వేస్తామని సంబంధిత సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, కౌన్సిలర్లు కౌడగోని సాంబయ్య, బీమా మల్లేష్, నాయకులు మెట్ట సుధాకర్, గాండ్ల సంపత్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయండి..

పిలుపునిచ్చిన సిఐటియు నాయకులు

రామకృష్ణాపూర్ జూన్ 28, (మన సమాజం):
సింగరేణిలో 12వ వేతన ఒప్పంద కమిటీ వేయాలని జులై 1వ తేదీన కొత్తగూడెం ప్రధాన కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సిఐటియు డిప్యూటీ జనరల్ సెక్రెటరీ అల్లి రాజేందర్, బ్రాంచ్ అధ్యక్షులు సాంబార్ వెంకటస్వామి కోరారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ లను అడ్డం పెట్టుకొని కోల్ ఇండియా యాజమాన్యం కమిటీని ఆలస్యం చేసే పద్ధతిని మార్చుకోవాలని సూచించారు. దేశంలో ఏ రంగంలో అమలు చేయని లేబర్ కోడ్ లను బొగ్గు రంగంలో అమలు చేయడం ఏంటని వారు ప్రశ్నించారు. లేబర్ కోడ్ లను వ్యతిరేకించిన బిఎంఎస్ యూనియన్ వేతన ఒప్పంద కమిటీ కోసం నాలుగు యూనియన్లు ఐక్యంగా కలిసి చేస్తున్న ధర్నాకు కలిసి రావాలని పిలుపునిచ్చారు. జులై 1వ తేదీన కొత్తగూడెంలో నిర్వహించే ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ప్రవీణ్, సురేష్, కుమారస్వామి, శ్రీధర్, శ్రీకాంత్, హరీష్, తాజ్ పాల్గొన్నారు.

బాసర జ్ఞాన సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ఆలయ అభివృద్ధి పనులపై సమీక్ష

టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశం

బాసర, జూన్ 28: పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు మంగళవాయిద్యాలు, పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇటీవల చోరీ జరిగిన మహంకాళి అమ్మవారి ఆలయాన్ని మంత్రి సందర్శించి ఘటనపై ఆరా తీశారు. ఆలయ భద్రతా ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అంతకుముందు ఇంద్రప్రస్థ గెస్ట్ హౌస్‌లో బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులు, టెండర్ల ప్రక్రియ పురోగతిపై జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎస్పీ జానకి, ఆలయ ఈవో అంజనాదేవితో మంత్రి సమీక్ష నిర్వహించారు. టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, బాసర సర్పంచ్ వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం ఊరేగింపులో 15వేల మందిని చంపాలనుకున్నా

నిందితుడి అంగీకారం.. ఎలుకల మందు మాత్రల పంపిణీ

ముంబై, జూన్ 28:
మొహర్రం ఊరేగింపును విషాదంగా మార్చేందుకు ఓ వ్యక్తి చేసిన యత్నం ముగ్గురు మహిళా వాలంటీర్లు, పోలీసుల అప్రమత్తతతో తప్పినప్పటికీ, దాని వెనుక ఉన్న కుట్ర భయం కలిగించేదిగా ఉంది. ఊరేగింపులో పాల్గొన్నవారికి విషపు మాత్రలు ఇచ్చి కనీసం 15వేల మందిని చంపాలని అనుకున్నట్టు నిందితుడు ఫయాజ్ ప్రేమ్‌జీ పోలీసుల వద్ద అంగీకరించడం కుట్ర తీవ్రతను బహిర్గత పరుస్తోంది. ముంబైలో శుక్రవారం జరిగిన మొహర్రం ఊరేగింపులో పాల్గొన్నవారికి అతడు రోగనిరోధక శక్తి పెంచే మాత్రల పేరుతో ఎలుకల మందు నింపిన క్యాప్యూల్స్‌ను పంపిణీ చేసి ఈ దారుణానికి పాల్పడ్డాడు. మొహరం నాడు జరిపే అషురా ఊరేగింపు రీయే రోడ్‌లోని రహమతాబాద్ శ్మశానవాటిక వద్దకు చేరుకోగానే రద్దీ అధికమయింది. దీనిని అవకాశంగా తీసుకున్న ప్రేమ్‌జీ ఎలుక మందు నింపిన క్యాప్యూల్స్‌ను పంచిపెట్టాడు. మరికొందరి చేత పంపిణీ చేయించాడు. అతడు వ్యవహరించిన తీరు అనుమానాస్పదంగా ఉండడంతో ముగ్గురు మహిళా వాలంటీర్లు నిలదీసి అడిగారు. ఆ మాత్రలను మింగొద్దంటూ లౌడ్ స్పీకర్ ద్వారా చెప్పించారు. మరోసారి గట్టిగా అడిగేసరికి అవి రోగనిరోధక శక్తిని పెంచే మాత్రలని నిందితుడు సమా?ధానం ఇచ్చాడు. అయినా నమ్మకం కుదరక ఆ క్యాప్యూల్స్‌ను ముక్కలు చేసి చూడగా వారి అనుమానాలు మరింత బలపడ్డాయి. దాంతో విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు ఆ క్యాప్యూల్‌ను తీసుకున్న సల్మాన్ సయీద్ అనే వ్యక్తికి వాంతులు కావడంతో

పాటు కడుపునొప్పితో బాధపడ్డాడు. అతనితోపాటు మొత్తం 11 మంది అనారోగ్యానికి గురయ్యారు. వెంటనే వారిని సమీపంలోని ఆస్పత్రికి తరలించగా కోలుకున్నారు. స్పందించిన బైకుల్లా ఏరియా పోలీసులు ప్రేమ్‌జీని ఆ శ్మశానం వద్దే అదుపులోకి తీసుకొని అతడి వద్ద ఉన్న 14,900 క్యాప్యూల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. కనీసం 15వేల మందిని చంపాలని అనుకున్నట్టు అతడు పోలీసులకు చెప్పాడు. నిందితుడు ప్రేమ్‌జీ పుణెలోని విమాన్‌నగర్ నివాసి. బీబీఏ చదివిన అతడు అక్కడే పెయింటింగ్ వ్యాపారం చేస్తున్నాడు. ఈ ఘటన వెనుక ఉగ్రవాదం కుట్ర ఉందన్న అనుమానంతో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రస్టుకు ముందే తెలుసు!

అయోధ్య రామాలయంలో విరాళాల దోపిడీ వ్యవహారంపై పక్కా సమాచారం ఉంది

ఈ నెల 5వ తేదీనే నిందితుడి ఇంట్లోపోలీసులతో కలిసి ట్రస్టు సోదా

అయోధ్య, జూన్ 28:
అయోధ్య రామాలయంలో విరాళాల దోపిడీ వ్యవహారం బహిరంగం కావడానికి ముందే తీర్థక్షేత్ర ట్రస్టుకు తెలుసా?.. నిందితుడిని కూడా ట్రస్టు గుర్తించిందా?.. అంటే ఔననే సమాధానమే వినిపిస్తోంది. ఈ నెల 7న విరాళాల గోల్‌మాల్ వ్యవహారం బయటకు పొక్కింది. అయితే.. దీనికి రెండురోజుల ముందే అంటే.. ఈ నెల 5వ తేదీనే ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్‌కు ఈ విషయం తెలుసునని అధికారులు నిర్ధారించారు. అంతేకాదు.. ప్రస్తుతం ఈ కేసులో నిందితుడిగా ఉన్న అవినాశ్ శుక్లా ఇంట్లో అదే రోజు ట్రస్టు ప్రతినిధులతో పాటు పోలీసులు సోదాలు చేపట్టి కొంత మేరకు నగదును కూడా స్వాధీనం చేసుకున్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. అయితే, ఇంత జరిగినా ట్రస్టు నుంచి ఎలాంటి ఫిర్యాదు పోలీసులకు అందలేదని తెలిపాయి. 5వ తేదీన జరిగిన సోదాలు అనధికారికమని, ఎలాంటి ఎఫ్ఐఆర్ లేకుండానే సోదాలు చేపట్టినట్టు ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఈ నెల 7న విషయం వెలుగు చూసిన తర్వాత.. దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయిందని, దోపిడీ వ్యవహారం ట్రస్టుకు ముందే తెలిసినా ఈ విషయాన్ని గోప్యంగా ఉంచడం వెనుక అనేక అనుమానాలు వస్తున్నాయని పేర్కొన్నాయి. కానీ, ఈ కేసు విషయంలో ట్రస్టు చేసిన జాప్యంపై అధికారులు ఇప్పటి వరకు ప్రశ్నించకపోవడం గమనార్హం. ఇదిలావుంటే, 24 సెకన్ల నిడివి మాత్రమే ఉన్న సీసీటీవీ ఫుటేజ్‌లో ఓ నల్లటి బ్యాగుతో శుక్లా కనిపించారు. అతని నుంచి స్వాధీనం చేసుకున్న సొమ్ము దానిలో ఉండి ఉంటుందని భావిస్తున్నారు. మరో ఫొటోలో ఇంకోనిందితుడు రామశంకర్ మిశ్రా కూడా ఉన్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. ఇక, ప్రత్యేక దర్యాప్తు బృందం అన్ని కోణాల్లోనూ కేసును విచారిస్తోంది. అయోధ్య విరాళాల నిర్వహణలోని లోపాలపై దృష్టి పెట్టింది. నగదు స్వీకరణ, ఉద్యోగుల తనిఖీలు, సీసీటీవీ నిర్వహణ వంటి కీలక విషయాలపై విచారణ సాగుతున్నట్టు అధికారి ఒక రు తెలిపారు. కాగా, ఈ కేసును విచారిస్తున్న సిట్ తన ప్రాథమిక నివేదికను సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు ఆదివారం అందించింది. అదేరోజు వేర్వేరు ప్రాంతాల్లోని ఎనిమిదిమంది నిందితుల ఇళ్లలో ఏకకాలంలో అధికారులు దాడులు చేశారు. కీలక నిందితులు అవినాశ్ శుక్లా, లవ్‌కుశ్



మిశ్రా, రామశంకర్ యాదవ్ సహా అందరి ఇళ్లలోనూ తనిఖీలు చేసినట్టు పోలీసులు తెలిపారు. కాగా, కోర్టు ఈ నెల 29 వరకు నిందితులకు జ్యుడీషియల్ రిమాండ్ విధించిన విషయం తెలిసిందే.

రాత్రికి రాత్రే కోటీశ్వరులు!
అయోధ్య విరాళాల దోపిడీ వ్యవహారంలో కీలక సూత్రధారి(మాస్టర్ మైండ్)గా భావిస్తున్న అనుకల్ప్ మిశ్రా, ఆయన బావమరిది లవ్‌కుశ్ మిశ్రాలు రాత్రికి రాత్రే రూ.కోట్లకు పగడలెత్తడం ఈ కేసు తీవ్రతను స్పష్టం చేస్తోందని అధికారులు భావిస్తున్నారు. ఆదివారం అనుకల్ప్‌కు చెందిన బసవ గ్రామంలో అధికారులు తనిఖీలు నిర్వహించినప్పుడు విలాసవంతమైన భవనాలను గుర్తించారు. అలాగే వారి ఆర్థిక పరిస్థితులపై కుటుంబీకులు సహా చుట్టుపక్కల వారి నుంచి సమాచారం సేకరించారు. అనుకల్ప్ నిన్నమొన్నటి వరకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇటీవలే భారీ ఎత్తున భవనాలను నిర్మించడంతోపాటు పొలాలు, స్థలాలను కూడా కొనుగోలు చేశారని స్థానికులు తెలిపారు. అయితే, అనుకల్ప్ మంచి వాడేనని చెప్పినట్టు అధికార వర్గాల ద్వారా తెలిసింది. అనుకల్ప్ తాత రాజేంద్రప్రసాద్ ఇచ్చిన సమాచారం మేరకు.. గత ఏప్రిల్ 30న ఏడు రోజుల పాటు భారీ కార్యక్రమం నిర్వహించారు. దీనికి చంపత్‌రాయ్ సహా తీర్థక్షేత్ర ట్రస్టు నుంచి ప్రముఖులు సైతం హాజరయ్యారు. అయితే.. ఇంత పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహించేందుకు అంత సొమ్ము ఎలా వచ్చిందో తనకు తెలియదని పేర్కొన్నారు. ఇక, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అనుకల్ప్ ఇటీవలే వ్యవసాయ క్షేత్రాన్ని నిర్మించారు. గత ఏడాది రూ.65 లక్షలు పెట్టి అయోధ్యలో ఇల్లు కొనుగోలు చేశారు. అయితే.. అనుకల్ప్ ఓ బ్యాంకులో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి మాత్రమేనని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇంత సొమ్ము ఎక్కడి నుంచి వచ్చిందన్న విషయంపై ఆరా తీస్తున్నారు. ఇదిలావుంటే, లవ్‌కుశ్‌ను అనుకల్ప్ విరాళాలు లెక్కించే ఉద్యోగంలో చేర్చినట్టు గుర్తించారు. లవ్‌కుశ్ నిన్న మొన్నటి వరకు అద్దె ఇంట్లో ఉండేవారని, తాజాగా ఆయన రూ.లక్షలు ఖరీదు చేసే వాహనాన్ని కొనుగోలు చేసినట్టు రుదౌళీ ప్రాంతానికి చెందిన స్థానికులు అధికారులకు తెలిపారు.

రెండు చుక్కలు.. జీవితానికి రక్షణ

- ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు - తల్లిదండ్రులకు సీఎం విజ్ఞప్తి - పోలియో రహిత తెలంగాణే లక్ష్యం

హైదరాబాద్, జూన్ 28

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రతి తల్లిదండ్రులు తప్పనిసరిగా భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేళ్లలోపు వయస్సు ఉన్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ పోలియో చుక్కలు చిన్నారులకు జీవితాంతం రక్షణ కవచంలా నిలుస్తాయని అన్నారు. పోలియో వంటి ప్రమాదకర వ్యాధిని పూర్తిగా నివారించడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రతి చిన్నారి ఆరోగ్యవంతమైన జీవితానికి ఇది అత్యంత అవసరమని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాలకు చిన్నారులను తీసుకువెళ్లి రెండు చుక్కలు వేయించాలని తల్లిదండ్రులను కోరారు. ఏ చిన్నారి కూడా ఈ కార్యక్రమానికి దూరం కాకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. పోలియో నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని ముఖ్యమంత్రి అన్నారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చిన్నారుల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజారోగ్య పరిరక్షణ కోసం నిరంతరం చర్యలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణంలో ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలని కోరారు. పోలియో రహిత తెలంగాణ, పోలియో రహిత భారతదేశం సాధనే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతి చిన్నారికి రెండు పోలియో చుక్కలు వేయించడం ద్వారా ఆరోగ్యవంతమైన భావితరాలకు బాటలు వేయవచ్చని ఆయన అన్నారు.

పీవీకి ఘన నివాళులు..

- 105వ జయంతి సందర్భంగా జ్ఞానభూమిలో నివాళి

- పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షుడు, మంత్రులు

- పీవీ సేవలను స్మరించిన నేతలు

హైదరాబాద్, జూన్ 28

మాజీ ప్రధాని, భారతరత్న పాములపర్తి వెంకట నరసింహారావు 105వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని పీవీ జ్ఞానభూమి వద్ద పలువురు కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవీ నరసింహారావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఆయన దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. భారత ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన దార్శనిక నాయకుడిగా, పరిపాలనలో విశిష్ట ముద్ర వేసిన మహానేతగా పీవీని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. పీవీ జ్ఞానభూమి వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ పీవీ నరసింహారావు దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడంలో కీలక పాత్ర పోషించారని, విదేశాంగం, విద్య, పరిపాలన రంగాల్లో ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. బహుభాషా కోవిదుడిగా, దూరదృష్టి కలిగిన నాయకుడిగా ఆయనను గుర్తు చేసుకున్నారు. దేశ అభివృద్ధికి పీవీ నరసింహారావు చేసిన సేవలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని, ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నేతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి అనుగ్రహంతో సమృద్ధిగా వర్షాలు కురవాలి

- నంగునూరులో భక్తాంజనేయ స్వామి పునఃప్రతిష్ఠలో హరీశ్ రావు

- ప్రజల సుభిక్షం కోసం ప్రత్యేక ప్రార్థనలు

- స్వామి ఆశీస్సులతో ప్రాంతాభివృద్ధికి ఆకాంక్ష

సిద్దిపేట, జూన్ 28

సిద్దిపేట జిల్లా నంగునూర్ మండల కేంద్రంలోని శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించారు.

ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ ఈ ఏడాది కరవు పరిస్థితులపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆంజనేయ స్వామి అనుగ్రహంతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షించారు. రైతులకు పుష్కలంగా పంటలు పండాలని, గ్రామీణ ప్రాంతాలు సస్యశ్యామలంగా మారాలని కోరుకున్నారు. ఎన్నో సంవత్సరాల చరిత్ర కలిగిన భక్తాంజనేయ స్వామి దేవాలయంలో పునఃప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు సామాజిక ఐక్యతను బలోపేతం చేస్తాయని అన్నారు. స్వామివారి ఆశీస్సులతో నంగునూర్ మండలం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రాంత అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేదమంత్రోచ్చారణల మధ్య జరిగిన పునఃప్రతిష్ఠ కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా జరిగింది.

రూ.13,060 కోట్లతో రాష్ట్ర రహదారుల విస్తరణకు శ్రీకారం

- హెచ్‌ఏఎం విధానంలో 6,092 కి.మీ. రహదారుల అభివృద్ధి

- నల్గొండలో పైలాన్ ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి

- 34 ప్యాకేజీల్లో 441 రహదారుల విస్తరణ

నల్గొండ, జూన్ 28

తెలంగాణలో రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్‌ఏఎం) విధానంలో చేపట్టనున్న రహదారుల నిర్మాణ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నల్గొండ జిల్లా కనగల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పైలాన్ ఆవిష్కరించి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రూ.13,060 కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా 34 ప్యాకేజీలుగా మొత్తం 6,092 కిలోమీటర్ల పొడవున 441 రహదారులను విస్తరించి, అభివృద్ధి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టుతో రాష్ట్రంలో రహదారి అనుసంధానం మరింత బలోపేతం కానుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ మెరుగైన రహదారులు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, పారిశ్రామిక పురోగతికి, ప్రజల రాకపోకలకు కీలకమని అన్నారు. అన్ని ప్రాంతాలకు నాణ్యమైన రహదారి సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పైలాన్ ఆవిష్కరణ అనంతరం ముఖ్యమంత్రి స్థానిక ప్రజలను పలకరిస్తూ వారితో కరచాలనం చేశారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొంటూ ప్రభుత్వ సంకల్పాన్ని వివరించారు. ఈకార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ రహదారి విస్తరణ పనులు రాష్ట్ర రవాణా వ్యవస్థను మరింత ఆధునికంగా తీర్చిదిద్దనున్నాయని అధికారులు తెలిపారు.

లండన్‌లో తెలంగాణ విద్యార్థి మృతి

- శ్రీనాథ్ రెడ్డి మృతిపై అనుమానాలు

- న్యాయ విచారణకు కుటుంబం విజ్ఞప్తి

- మృతదేహం తరలింపునకు ప్రభుత్వ సాయం కోరుతూ వినతి

కామారెడ్డి, జూన్ 28

ఉన్నత విద్య కోసం లండన్‌కు వెళ్లిన తెలంగాణకు చెందిన విద్యార్థి శ్రీనాథ్ రెడ్డి అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం కలకలం రేపింది. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం తలమడ్ల గ్రామానికి చెందిన మధుసూధన్ రెడ్డి కుమారుడు శ్రీనాథ్ రెడ్డి సుమారు 14 నెలల క్రితం ఎంఎస్ చదువుకోడానికి లండన్ వెళ్లి అక్కడ స్నేహితులతో కలిసి నివాసం ఉంటున్నాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం ఈ నెల 22న రాత్రి శ్రీనాథ్ చివరిసారిగా ఇంటికి ఫోన్ చేసి కుటుంబ సభ్యులతో మాట్లాడాడు. ఎప్పటిలాగే ఉత్సాహంగా మాట్లాడిన అతడు అదే రోజు స్నేహితుల పుట్టినరోజు వేడుకకు హాజరైనట్లు తెలిపారు. అయితే మరుసటి రోజు ఉదయం తన గదిలో మృతదేహంగా కనిపించినట్లు స్నేహితులు సమాచారం అందించారు. శ్రీనాథ్ ఆత్మహత్య చేసుకున్నాడని అతని రూమ్‌మేట్లు చెబుతున్నప్పటికీ, కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని నమ్మడం లేదు. ముందు రోజు వరకు ఎలాంటి ఆందోళన లేకుండా సాధారణంగా మాట్లాడిన వ్యక్తి ఒక్కసారిగా ఆత్మహత్యకు పాల్పడటం అనుమానాలకు తావిస్తోందని వారు పేర్కొన్నారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి శ్రీనాథ్ మృతి హత్యా, ఆత్మహత్యా అన్న విషయాన్ని పూర్తిగా వెలుగులోకి తీసుకురావాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఈ కేసులో వాస్తవాలను నిష్పక్షపాతంగా విచారించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని విదేశీ అధికారులతో సమన్వయం చేసి పూర్తి స్థాయి విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా శ్రీనాథ్ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి ప్రభుత్వ సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. శ్రీనాథ్ మృతిపై పూర్తి వివరాలు అధికారిక దర్యాప్తులోనే తేలనున్నాయి. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. విదేశాల్లో చదువుతున్న భారతీయ విద్యార్థుల భద్రతపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

కాలువల్లో చెత్తే వరదలకు కారణం

- నాలాల నుంచి లారీల కొద్దీ వ్యర్థాల తొలగింపు

- హైడ్రా 24 గంటల ముమ్మర చర్యలు

- ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని విజ్ఞప్తి

హైదరాబాద్, జూన్ 28

నగరంలో వర్షాకాలం నేపథ్యంలో వరదల నివారణకు హైడ్రా చేపట్టిన ప్రత్యేక చర్యల్లో మురుగు, వరద కాలువల నుంచి భారీ మొత్తంలో చెత్త బయటపడుతోంది. కాలువల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, కేబుల్ వైర్లు, గృహోపకరణాలు, పూడికను తొలగిస్తూ వర్షపు నీరు సాఫీగా ప్రవహించేలా హైడ్రా అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు నిర్వహిస్తున్నారు. ప్రజలు నిర్లక్ష్యంగా కాలువల్లో వేస్తున్న చెత్తే వరదలకు ప్రధాన కారణమవుతోందని అధికారులు హెచ్చరిస్తున్నారు. హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్), మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు ఇరవై నాలుగు గంటలూ పనిచేస్తూ జీహెచ్ఎంసీ, ఇతర మున్సిపల్ సంస్థలు, నీటిపారుదల శాఖ, పోలీసు శాఖలతో కలిసి కాలువలను శుభ్రం చేస్తున్నాయి. ప్రతి వర్షం తర్వాత పెద్దఎత్తున చెత్త కాలువల్లోకి చేరి నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటోందని, దీంతో కాలనీలు, రహదారులు నీటమునిగే పరిస్థితులు ఏర్పడుతున్నాయని అధికారులు తెలిపారు. మెహిదీపట్నం, మల్లేపల్లి, విజయనగర్ కాలనీ మీదుగా మూసీలో కలిసే ఆఘాపురా నాలాలో పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. స్థానికుల ఫిర్యాదుతో అక్కడికి చేరుకున్న హైడ్రా బృందాలు ఆరు రోజులుగా నిరంతరంగా పనులు నిర్వహించి ఇప్పటికే 13 టిప్పర్ల చెత్తను తొలగించాయి. పరుపులు, దిండ్లు, సోఫాలు, కుర్చీలు, ప్లాస్టిక్ వ్యర్థాలు భారీగా బయటపడగా, మరో రెండు రోజుల్లో మొత్తం కాలువను పూర్తిగా శుభ్రం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. మియాపూర్--పటాన్‌చెరు మార్గంలోని బాక్స్ డ్రైన్‌లో కేబుల్ వైర్లు భారీగా పేరుకుపోవడంతో వర్షపు నీరు ముందుకు కదలలేని పరిస్థితి ఏర్పడింది. జేసీబీల సాయంతో కాలువను శుభ్రం చేయగా పెద్ద మొత్తంలో కేబుల్ వైర్లు, ఇతర చెత్త బయటపడింది. అలాగే చందానగర్--లింగంపల్లి ఆర్‌యూబీ వద్ద రెండు ట్రక్కుల ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించారు. జూబ్లీహిల్స్ నుంచి వచ్చే వరద నీటితో ప్రతి ఏడాది కృష్ణానగర్ ముంపునకు గురవుతున్న నేపథ్యంలో అక్కడి బాక్స్ డ్రైన్‌పై ఉన్న స్లాబులను తొలగించి జీహెచ్ఎంసీ సహకారంతో హైడ్రా భారీ స్థాయిలో పూడిక తొలగింపు చేపట్టింది. పది అడుగుల లోతున్న కాలువలో ఏడు అడుగుల మేర చెత్త పేరుకుపోవడంతో నీటి ప్రవాహం పూర్తిగా దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. కాలువల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, గృహోపకరణాలు వేయకుండా ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని హైడ్రా అధికారులు విజ్ఞప్తి చేశారు. నగరాన్ని వరదల నుంచి రక్షించాలంటే ప్రభుత్వ చర్యలతో పాటు ప్రజల సహకారం కూడా అవసరమని పేర్కొన్నారు. మాన్సూన్ కాలమంతా కాలువల శుభ్రతపై ప్రత్యేక దృష్టి కొనసాగిస్తామని హైడ్రా వెల్లడించింది.

నా వ్యక్తిగత జీవితంలోకి తొంగి చూడొద్దు..

కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్,ప్రముఖ నటి త్రిష కృష్ణన్ గురించి గత కొంతకాలంగా సోషల్ మీడియాలో అనేక రకాల ప్రచారాలు జరుగుతున్నాయి. వీరిద్దరి మధ్య ప్రత్యేక బంధం ఉందంటూ వస్తున్న పుకార్లు అభిమానులు, నెటిజన్లలో పెద్ద చర్చకు దారితీశాయి. ముఖ్యంగా విజయ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వార్తలు వెలుగులోకి వచ్చిన తర్వాత ఈ రూమర్ల తీవ్రత మరింత పెరిగింది. అయితే ఈ ప్రచారాలపై అటు విజయ్ గానీ, ఇటు త్రిష గానీ ఇప్పటివరకు ప్రత్యక్షంగా స్పందించింది లేదు. కానీ తాజాగా త్రిష సోషల్ మీడియాలో చేసిన ఒక పోస్ట్ మాత్రం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. తన వ్యక్తిగత జీవితంపై జరుగుతున్న చర్చలకు పరోక్షంగా సమాధానం ఇచ్చినట్లుగా ఆమె పోస్టు ఉండటంతో నెటిజన్లు దానిపై ఆసక్తికరంగా స్పందిస్తున్నారు. త్రిష తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ప్రశాంతంగా నిద్రిస్తున్న తన పెంపుడు కుక్క ఫోటోను షేర్ చేసింది. ఆ ఫోటోకు జత చేసిన క్యాప్షన్ అందరి దృష్టిని ఆకర్షించింది. “నా విషయాల్లో ముక్కు పెట్టడానికి నేను అనుమతించే ఒకే ఒక్క ముక్కు ఇదే” అంటూ ఆమె రాసుకొచ్చింది. ఈ వ్యాఖ్యను చాలా మంది సోషల్ మీడియాలో తన గురించి వస్తున్న రూమర్లకు ఇచ్చిన కౌంటర్‌గా భావిస్తున్నారు. త్రిష ఎవరినీ నేరుగా ఉద్దేశించి మాట్లాడకపోయినా, తన వ్యక్తిగత జీవితంపై నిరంతరం చర్చలు చేసే వారికి ఇది గట్టి సందేశమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సెలబ్రిటీల వ్యక్తిగత విషయాలపై అనవసర ఊహాగానాలు, సోషల్ మీడియా ట్రోలింగ్ పెరుగుతున్న నేపథ్యంలో త్రిష ఈ విధంగా స్పందించడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల త్రిష చేసిన ప్రతి సోషల్ మీడియా పోస్ట్ అభిమానుల మధ్య వైరల్ అవుతుండగా, ఈ తాజా పోస్ట్ కూడా భారీగా షేర్ అవుతోంది. కొందరు ఆమె ధైర్యాన్ని ప్రశంసిస్తుంటే, మరికొందరు ఇది రూమర్లకు ఇచ్చిన సూటి సమాధానమని వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తానికి, త్రిష తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న ప్రచారాలను పెద్దగా పట్టించుకోకుండా తనదైన శైలిలో స్పందించింది. ఈ పోస్ట్‌తో అయినా ఆమె గురించి జరుగుతున్న ఊహాగానాలు తగ్గుతాయా లేదా అన్నది చూడాల్సి ఉంది.

షూటింగ్‌లో కో-స్టార్ వేధింపులు..

‘నాకు ముద్దు పెడుతూనే ఉన్నాడంటూ’ బాలీవుడ్ నటి ఆవేదన

బాలీవుడ్, మరాఠీ చిత్ర పరిశ్రమలలో గుర్తింపు తెచ్చుకున్న నటి ప్రియా బాపట్ తన కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న ఒక చేదు అనుభవాన్ని తాజాగా పంచుకుంది. తన మొదటి సినిమా షూటింగ్ సమయంలో ఒక పాట చిత్రీకరణలో సహ నటుడు తనకు నచ్చకపోయినా పదే పదే ముద్దు పెట్టుకున్నాడని, ఆ సమయంలో తాను తీవ్ర అసౌకర్యానికి గురయ్యానని ఆమె వెల్లడించారు. కథా చర్చల సమయం నుంచే తాను ఆ ముద్దు సీన్ అవసరమా అని దర్శకుడిని ప్రశ్నించానని, అయితే షూటింగ్ స్పాట్‌లో మాత్రం సదరు నటుడు స్క్రిప్ట్‌లో లేని విధంగా, ఇంప్రూవైజేషన్ పేరుతో హద్దులు దాటి ప్రవర్తించాడని ప్రియా బాపట్ పేర్కొన్నారు. ఆ సమయంలో ఏం చేయాలో తోచక, తన గొంతు ఎలా వినిపించాలో తెలియక ఎంతో నిస్సహాయంగా ఉండిపోయానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఇబ్బందికరమైన వాతావరణం కేవలం షూటింగ్‌తోనే ముగిసిపోలేదని, తామిద్దరూ ఒకే హోటల్‌లో బస చేసినప్పుడు, తాను ఎన్నిసార్లు నిరాకరించినా ఆ నటుడు బ్రేక్‌ఫాస్ట్ లేదా డిన్నర్‌కు రమ్మంటూ పదే పదే వేధించాడని ప్రియ తెలిపారు. ఈ ఘటనతో తీవ్ర ఆందోళనకు గురైన తాను ప్రతిరోజూ రాత్రి తన భర్త ఉమేష్ కామత్‌కు ఫోన్ చేసి ఏడ్చేదాన్నని, దాంతో ఆందోళన చెందిన ఆయన వెంటనే ముంబై నుండి భోపాల్ షూటింగ్ స్పాట్‌కు వచ్చి మూడు రోజుల పాటు తనతోనే ఉన్నారని ఆమె గుర్తు చేసుకున్నారు. ‘మున్నాభాయ్ వీడీడీ’ చిత్రంతో పాటు ‘సిటీ ఆఫ్ డ్రీమ్స్’ వెబ్ సిరీస్‌తో మంచి గుర్తింపు తెచ్చుకున్న ప్రియా బాపట్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం చిత్ర పరిశ్రమలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

చిల్ అవుట్ మూడ్‌లో ప్రియాంకా చోప్రా..

స్టార్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి-మహేశ్ బాబు కునుకు లేకుండా చేస్తోంది.లాంగ్ గ్యాప్ తర్వాత హైదరాబాద్‌లో ఇలా కనిపించి నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పుడీ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. వారణాసి చిత్రాన్ని శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.

ఈ మూవీకి ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం రెండు పార్టులుగా రాబోతుంది. ఈ మూవీ ఫస్ట్ పార్ట్‌ను 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయన్నట్టు ఇప్పటికే ప్రకటించింది టీం. సెకండ్ పార్ట్ 2029లో వస్తుందని వార్తలు రాగా.. రాజమౌళి టీం రాబోయే రోజుల్లో ఏదైనా క్లారిటీ ఇస్తుందేమో చూడాలి.

స్టార్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి-మహేశ్ బాబు కాంపౌండ్ నుంచి రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ వారణాసి గ్లోబల్ అడ్వెంచరస్ ప్రాజెక్టుగా వస్తోన్న ఈ మూవీలో బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. మాలీవుడ్ స్టార్ యాక్టర్ పృథ్వీరాజ్ సుకుమార్ కీ రోల్‌లో నటిస్తున్నాడు. మాధవన్, ప్రకాశ్ రాజ్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. ప్రియాంకా చోప్రా వారణాసి షూటింగ్ కోసం హైదరాబాద్‌లో ఉన్న విషయం తెలిసిందే. ఎప్పుడూ షూటింగ్ షెడ్యూల్స్‌తో బిజీబిజీగా గడిపే ఈ భామ కాస్త రిలాక్సింగ్ మూడ్‌లోకి వెళ్లిపోయింది. షూట్ బ్రేక్ టైంలో ఆదివారం సరదాగా స్విమ్మింగ్ చేసింది. బికినీలో ఓ వైపు హొయలుపోతూ.. మరోవైపు అందాలు ఆరబోస్తూ కుర్రకారుకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.లాంగ్ గ్యాప్ తర్వాత హైదరాబాద్‌లో ఇలా కనిపించి నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పుడీ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. వారణాసి చిత్రాన్ని శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.

ఈ మూవీకి ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం రెండు పార్టులుగా రాబోతుంది. ఈ మూవీ ఫస్ట్ పార్ట్‌ను 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయన్నట్టు ఇప్పటికే ప్రకటించింది టీం. సెకండ్ పార్ట్ 2029లో వస్తుందని వార్తలు రాగా.. రాజమౌళి టీం రాబోయే రోజుల్లో ఏదైనా క్లారిటీ ఇస్తుందేమో చూడాలి.

ఇండస్ట్రీలో అది గోల్డెన్ రూల్

సాంఘిక మాధ్యమం అనేది పరిశ్రమలో చాలామందికి వ్యసనంగా, ఇంకా చెప్పాలంటే శాపంగా మారిందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో రష్మిక మందన్నా అన్నారు. సోషల్ మీడియాలో నెగెటివిటీ గురించి మాట్లాడుతూ ఆమె పై రీతిగా స్పందించారు. ‘పాజిటివ్ కామెంట్స్ వందల్లో ఉన్నప్పటికీ, ఎక్కడో ఒక మూల ఉన్న నెగెటివ్ కామెంట్ మనశ్శాంతిని పూర్తిగా దెబ్బతీస్తుంది. రోజంతా పడ్డ కష్టాన్ని, తద్వారా వచ్చిన ఆనందాన్ని క్షణాల్లో మాయం చేస్తుంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే నేనూ.. నా సినిమాలు విడుదలైన సమయంలో విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటూ ఉంటాను. రిలీజ్ రోజులో పగటిపూట వాతావరణం చాలా బావుంటుంది. కామెంట్లన్నీ సానుకూలంగా కనిపిస్తాయి. రాత్రి 9గంటలు దాటాక నెగెటివిటీ, ట్రోలింగ్ ఒక్కసారిగా పెరుగుతుంది. రోజంతా ప్రశాం తంగా ఉన్న నెటిజన్లు, రాత్రి కాగానే ఎందుకు అంతలా మారిపో తారో అర్థంకాదు. దీనివల్ల రాత్రి 9గంటలు దాటాక ఎట్టి పరిస్థితుల్లోనూ సోషల్ మీడియా ఓపెన్ చేయకూడదనేది ఇండస్ట్రీలో గోల్డెన్ రూల్‌గా మారింది’ అంటూ ఆవేదన వ్యక్తం చేశారు రష్మిక మందన్నా.